
పిల్లలు...పిడుగులు!
(బాలల నవల)
డా॥ వసా ప్రభావతి

# పిల్లలు - పిడుగులూ!

హైదరాబాదులోని బోయినపల్లిలో రాణి, సోము అనే అక్కా, తమ్ముడు ఉంటున్నారు. సీతమ్మ, గోవిందరావు వారి తల్లిదండ్రులు. వారి ఇంటికి ఎదురుగా చందూ, గీతా అనే అన్నాచెల్లెళ్లు ఉన్నారు. కాంతమ్మ, హనుమంతురావు దంపతులు వారి తల్లిదండ్రులు

దంపతులిద్దరూ పిల్లల్ని ఎంతో ముద్దుగా పెంచుకుంటున్నారు. పిల్లలు కూడా ఎంతో బుద్ధిగా చదువుకుంటున్నారు.

రాణి, సోమూ, చందూ, గీతలు ఒకే బడిలో చదువుకుంటున్నారు. ఆ నలుగురికి ఎంతో స్నేహం... ఒకేసారి బడికి వెళ్ళి, ఒకేసారి తిరిగి వస్తారు.

వారు బడి నుంచి తిరిగి వస్తూ ఎన్నో సంగతులు చెప్పుకుని నవ్వుకుంటారు. ఒకరోజు సోము "ఒరే చందూ! నేను చిన్నప్పుడు అన్నం తినక మారాంచేసేవాడిని. అప్పుడు మా అమ్మ బూచోడొస్తాడు. అన్నం తినకపోతే ఎత్తుకుపోతాడు" అనేది అని చెప్పాడు.

"అవును! అవును! మా అమ్మ కూడా నేను మారాం చేస్తే చీకట్లో చూపించి బూచాడొచ్చి ఎత్తుకుపోతాడనేది" అంది గీత.

"అసలు చీకట్లోంచి బూచాడొస్తాడా?" అనే సందేహాన్ని వెలిబుచ్చింది రాణి.

"ఏమో మరి? నిజంగా బూచాడొస్తాడోలేదో తెలియదు. బూచాడిని ఎప్పుడూ చూడలేదుగా?" అంది గీత.

"అసలు బూచాడంటే దొంగాడా?" సందేహంగా అడిగాడు చందూ.

"బూచాడెలా ఉంటాడో అమ్మ! నాన్నలనే అడుగుదాం" అంది రాణి.



నలుగురూ ఇంటిముఖం పట్టారు. నలుగురూ రోజూ స్కూలికి సైకిళ్ళమీదే వెళ్ళి వస్తున్నారు. రాణి, సోములు ఇంటికి రాగానే పుస్తకాల సంచీ టేబులుమీద పెట్టుకున్నారు. బూట్లు విప్పి స్టాండులో పెట్టుకున్నారు. స్కూలు డ్రస్సులు మార్చుకున్నారు. కాళ్ళు, చేతులు, ముఖం కడుక్కువచ్చారు.

"రాణీ, సోమూ! రండి వచ్చి పాలు తాగండి" అంటూ పిలిచింది తల్లి సీతమ్మ. వెంటనే రాణి, సోములు తల్లి దగ్గరకు పరుగెత్తుకొని వచ్చారు.

తల్లి ఇచ్చిన పాలగ్లాసు, బిస్కట్లూ అందుకున్నారు.

"అమ్మా! అమ్మా! చీకట్లో బూచాడుంటాడా" అంటూ ఇద్దరూ ఒకేసారి అడిగారు.

"ఎందుకు ఉండడు? పిల్లలు చెప్పిన మాట వినకుండా మారాం చేస్తే తప్పకుండా వస్తాడు" అంది తల్లి.

"అలాగా? అయితే బూచాడంటే ఎవరు? దొంగ అంటే ఎవరు?" తల్లిని అడిగింది రాణి.

"పిల్లలు అల్లరి చేస్తే వచ్చేవాడు బూచాడు. ఇళ్ళల్లో దొంగతనాలు చేసేవాడు దొంగాడు" వివరించింది తల్లి.

"ఓహో! అలాగా?" అంటు పాలు తాగడం పూర్తిచేసిన రాణి, సోమూ అక్కడి నుంచి తమ గదిలోకి వెళ్ళారు. పుస్తకాల సంచీలు తెరచి హోంవర్కు చేసుకోవడం మొదలుపెట్టారు.

చందూ, గీతలు కూడా ఇంటికి వెళ్ళారు. పుస్తకాల సంచులు గూట్లో పెట్టుకున్నారు. బూట్లు విప్పుకున్నారు. స్కూలు డ్రస్సులు మార్చుకుని, కాళ్ళు చేతులు కడుక్కున్నారు. వాళ్ళ నాయనమ్మ ఇచ్చిన అరటిపళ్ళు తిని, పాలు తాగారు.

"నాయనమ్మా! చీకట్లో బూచాళ్ళుంటారా?" అడిగారు.

"తప్పక ఉంటారు? పిల్లలు అల్లరిచేస్తే వచ్చేస్తారు!" అందావిడ.

"బూచాళ్ళంటే ఎవరు? దొంగలంటె ఎవరు?" గీత నాయనమ్మ నడిగింది.

"బూచాళ్ళన్నా, దొంగలన్నా ఒక్కరేరా?" అంది నాయనమ్మ.

"నాయనమ్మా! చీకట్లోనే ఎందుకుంటారు?" అడిగాడు చందూ.

"పగలు వెలుగులో జనం దొంగల్ని పట్టుకుంటారని రాత్రి చీకట్లో తిరుగుతారు దొంగలు" అప్పుడే అక్కడకు వచ్చిన తండ్రి చెప్పాడు.

"అలాగా నాన్నా" చందూ, గీతలు ఒకేసారి అన్నారు.

"అయితే దొంగలు రాత్రి చీకట్లో తిరుగుతారన్న మాట" అన్నాడు చందూ.

"అవును... అవును... చీకట్లో తిరుగుతారు" అంది గీత.

ఇద్దరూ అక్కడ నుంచి లేచారు. సంచిలోంచి పుస్తకాలు తీసి హోంవర్కులు చేసుకోవడం మొదలుపెట్టారు.

మరునాడు బడి వదిలాక రాణీ, సోమూ, చందూ, గీతలు వెళ్ళి బడి ఆట స్థలంలో కూర్చున్నారు.

"బూచాడంటే దొంగాడే! పిల్లల్ని భయపెట్టడానికి అలా అంటారన్న మాట!" అంది రాణి.

"అవును మా బామ్మకూడా అలాగె చెప్పింది"అన్నాడు చందూ.

"పగలయితే జనం పట్టుకుంటారని దొంగలు చీకట్లో తిరుగుతారన్నమాట" అంది గీత.

“ఈ దొంగలే పిల్లల్ని ఎత్తుకుపోతారన్న మాట?” అంది రాణి.

“అయితే మనం రాత్రివేళ చీకట్లో తిరిగి దొంగల్ని పట్టుకోవాలి” అన్నాడు చందూ.

“అయితే మనం చీకట్లో దొంగల్ని వెతికిపట్టుకుందాం!” అన్నాడు సోము.

తరువాత నలుగురూ సైకిళ్ళు ఎక్కి ఇళ్ళకు బయల్దేరి వచ్చేశారు.

కొన్ని రోజుల తర్వాత అక్కడక్కడ ఇళ్ళల్లో రాత్రివేళ దొంగలుపడి దోచుకుపోతున్నారని గందరగోళం ప్రారంభమయింది. ఈ నలుగురు పిల్లల ఉత్సాహానికి అంతులేదు. ఎలాగైనా రాత్రివేళ చీకట్లో దొంగల్ని వెతికిపట్టుకోవాలనుకున్నారు.

అప్పుడు పోలీసులు, దొంగలు పడిన ఇళ్ళకు వెళ్ళి వివరాలు తెలుసుకొని, దొంగలకోసం వెతకడం ప్రారంభించారు.

ఇంకేముంది నలుగురు పిల్లలు స్కూలు వదిలాక వచ్చి పోలీసుల వెంటే ఇళ్ళకు బయలుదేరుతున్నారు. రాత్రిళ్ళు పోలీసుల వెంట వెళ్ళి తాము కూడా దొంగల్ని పట్టుకోవాలనుకొనీ బయలుదేరారు.

“మీరు మా వెంట రాకూడదు. మీరు చిన్న పిల్లలు. దొంగల్ని పట్టుకోలేరు. మేము పట్టుకొని దొంగల్ని పోలీసుస్టేషన్‌కి తీసుకువస్తాం. అప్పుడు చూద్దురుగాని” అని చెప్పారు పోలీసులు.

“అలాగే” అని నలుగురు పిల్లలు పోలీసుల వెంట వెళ్ళడం మానేసి ఇంటికి వచ్చేశారు. కానీ వారి ఉత్సాహం తగ్గలేదు. వారి కోరికా చల్లారలేదు.

ఏం చెయ్యాలా అని ఆలోచించడం మొదలుపెట్టారు.

రాణి, చందూ ఆరవ తరగతి చదువుతున్నారు. వారికి పదకొండేళ్ళు సోము, గీతలు 4వ తరగతిలో ఉన్నారు. వారికి 9వ సంవత్సరం. నలుగురికి పట్టుదల ఉంది.

ధైర్యముంది. అందుకే వారు అన్ని తెలుసుకుంటున్నారు. పోలీసులు వారిని రానియ్యడంలేదు. అందుకనే వాళ్ళే దొంగల్ని ఎలాగైనా పట్టుకోవాలని నిశ్చయించుకున్నారు. అదే విషయం ఆలోచించడం మొదలుపెట్టారు.

పోలీసుల చేతుల్లో పెద్దపెద్ద బ్యాట్రీలైట్లు చూశారు. ఆ లైట్లు తీసుకుని రాత్రివేళ చీకట్లో దొంగల్ని పట్టుకోవడానికి వెదుకుతున్నారు.

ముందు తాము కూడా ఆ లైట్లు కొనుక్కోవాలనుకున్నారు. తల్లిదండ్రుల్ని డబ్బు అడిగితే తిడతారు. అందుకే తాము దాచుకున్న డబ్బుతో ఇంట్లో వాళ్ళకి తెలియకుండా బ్యాట్రీలైట్లు కొని తెచ్చుకున్నారు. పోలీసుల దగ్గరున్నంత లైట్లు కాకుండా చిన్న లైట్లు దొరికాయి. వాటిని ఇంట్లోవాళ్ళు చూడకుండా పుస్తకాల గూట్లో అడుగున దాచేసుకున్నారు.

సాయంకాలం బడి నుంచి ఇంటికి రాగానే హోంవర్కులు పూర్తిచేసుకునేవారు. చదువ వలసిన పాఠాలు చదువేసుకునేవారు. ఫ్రెండు ఇంటికి వెళ్ళి చదువుకోవాలని చీకటి పడగానే ఇంట్లోంచి బయలుదేరేవారు. ఒకరోజు బోయినపల్లికి తూర్పు భాగంలో, మరో రోజు పడమటివైపు భాగంలో ఉన్న తోటల్లో చీకట్లో... భయపడుతూనే తిరిగారు. లోపల భయమున్నా పైకి ధైర్యం తెచ్చుకుంటున్నారు.

అయినా ఆరోజు సోమూ కాళ్ళు వణుకుతుంటే చూసిన చందూ పకపకా నవ్వాడు.

"నీ కాళ్ళు వణుకుతున్నాయి. నీకు భయమేస్తోందా సోమూ" పకపకా నవ్వుతూనే అడిగింది గీత.

"నీ కాళ్ళు, చేతులు కూడా వణుకుతున్నాయే గీతా!" అంటూ ఈసారి రాణి పకపకా నవ్వింది.

సైకిళ్ళు తీసుకుంటూ బ్యాట్రీలైట్ల కాంతుల్లో వాళ్ళు నవ్వుకుంటూ ముందుకు నడుస్తున్నారు. వాళ్ళు ఎక్కువ దూరం రాలేదు. వెనకాల నుంచి రోడ్డు కనపడుతూనే

**End of Preview.**

**Rest of the book can be read @**

**[http://kinige.com/book/Pillalu+Pidugulu](http://kinige.com/book/Pillalu+Pidugulu)**

* * *